క్లుప్తంగా

అగ్ని ప్రమాదాలపై అవగాహన



వైద్యులు, సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న ఫైర్ అధికారులు

చెన్నూర్: అగ్ని ప్రమాదాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని ఫైర్ ఆఫీసర్ రాజేందర్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో అగ్ని ప్రమాదాలు జరిగిన సమయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వైద్యులు, సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యులు సత్యనారాయణ, వైద్య, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఆయుర్వేద వైద్య శిబిరం

శ్రీరాంపూర్: సింగరేణి ఆధ్వర్యంలో గురువారం ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఏరియా డీజీఎం(పర్సనల్) అరవీందర్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నస్పూర్ కాలనీలోని మనోరంజన్ సముదాయంలో ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు, దీనికి డాక్టర్ విశ్వనాథమహర్షి హాజరై వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. బీపీ, షుగర్, కీళ్లనొప్పుల పరీక్షలు నిర్వహించి మందులు ఇవ్వనున్నట్లు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని వాల్యూ ఫిచ్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో బుధవారం ఉచిత వైద్య శిబిరం జరిగింది. సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బందికి వైద్య పరీక్షలు చేశారు.

రోడ్డు భద్రతపై అవగాహన

శ్రీరాంపూర్: రోడ్డు భద్రతపై మంచిర్యాల ఆర్టీసీ డిపో అధికారులు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీరాంపూర్ బస్టాండ్‌లో బుధవారం సేఫ్టీ వార్డెన్ జీఆర్ మాళి పాల్గొని పాల్గొని ప్రయాణికులు ఫుట్‌బోర్డు ప్రయాణం ప్రమాదకరమన్నారు. బస్సు ఆగిన తరువాతనే ఎక్కాలన్నారు. గమ్యం యాప్‌ను వినియోగించుకోవాలన్నారు. దీని ఆపరేటింగ్‌ను వివరించారు. మహాలక్ష్మి పథకంను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిపో సిబ్బంది పాల్గొన్నారు.

నియామకం



షెడంశెట్టి రమేశ్

భీమారం: కాంగ్రెస్ పార్టీ మండల సోషల్‌మీడియా కో ఆర్డినేటర్‌గా కాజిపల్లి గ్రామానికి చెందిన షెడంశెట్టి రమేశ్‌ను నియమించారు. ఈ మేరకు బుధవారం చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి చేతుల మీదుగా రమేశ్ నియామకపత్రాన్ని అందుకున్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యున్నతి కోసం రానున్న పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో తనవంతు కృషి చేస్తానని రమేశ్ హామీ ఇచ్చారు. తనను నమ్మి పదవి ఇచ్చిన ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామికి కృతజ్ఞతలు తెలిపారు.

జన్నారంవాసికి డాక్టరేట్



రాజేంద్రకుమార్

జన్నారం: మండలంలోని పొనకల్ గ్రామ పంచాయతీ అక్కపెల్లి గూడకు చెందిన జాడి రాజేంద్రకుమార్‌కు ఫార్మసీ విభాగంలో గౌరవ డాక్టరేట్ లభించింది. ఉస్మానియ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ ప్రొఫెసర్ శ్రీను నాయక్ పర్యవేక్షణలో ఫార్ములేషన్ డెవలప్‌మెంట్ అండ్ క్యారక్టరైజేషన్ ఆఫ్ గ్యాస్ట్రో రిటెంటీవ్ డ్రగ్ డెలివరీ సిస్టమ్ అనే అంశంపై చేసిన పరిశోధనపై ఆయన డాక్టరేట్ అందుకున్నారు. డాక్టరేట్ రావడంపై మండలానికి చెందిన తండ్రి రాజలింగం, స్నేహితులు ఆయన్ను అభినందించారు.

వాహనాలు తనిఖీ



తనిఖీ చేస్తున్న ఎస్సై ప్రవీణ్‌కుమార్

కాసిపేట: స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలోని సోమగూడెం చౌరస్తాలో బుధవారం రాత్రి ఎస్సై ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి గురువారం నుంచి నామినేషన్‌ల ప్రక్రియ ప్రారంభం కానుండటంతో ముందస్తుగా వాహన తనిఖీలు చేపట్టారు. నేటి నుంచి చెక్ పోస్టు ప్రారంభించనున్నట్లు, ఆధారాలు లేకుండా రూ.50వేలకు మించి నగదు తరలించరాదని పేర్కొన్నారు.



కాసిపేట: ధర్మరావుపేటలో ఆశీర్వాదం తీసుకుంటున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు



రామకృష్ణాపూర్: కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే వివేక్, జీఎం దంపతులు



కాసిపేట: మొక్కులు తీర్చుకుంటున్న గడ్డం వినోద్ దంపతులు



బెల్లంపల్లి బుగ్గ రాజేశ్వర స్వామి ఆలయంలో..



జన్నారం: పొనకల్‌లో తాళి చూపిస్తున్న పూజారి



బెల్లంపల్లి: కల్యాణ వేడుకకు హాజరైన భక్తులు



జన్నారం: పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బొజ్జు



చెన్నూర్: తాళి చూపుతున్న అర్చకుడు

వైభవంగా కల్యాణం..!

- వేద మంత్రోచ్ఛరణల మధ్య సీతారాముల కల్యాణం
- భక్తజనంతో కిక్కిరిసిన ఆలయాలు
- రామనామ స్మరణతో మార్మోగిన పల్లెలు

సాక్షి నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా శ్రీరామనవమి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. సీతారామచంద్రుల కల్యాణ మహోత్సవాన్ని ప్రత్యేక మండపంలో హనుమ, లక్ష్మణ సహిత సీతారాముల ఉత్సవ మూర్తుల విగ్రహాలను మేళతాళాల మధ్య ఏర్పాటు చేసి కల్యాణ ఘట్టాన్ని ప్రారంభించారు. వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛారణల మధ్య జరిగిన కల్యాణ ఘట్టంలో భాగంగా యజ్ఞోపవేతధారణ, కన్యాదానం, జీలకర్ర బెల్లం, మాంగళ్య ధారణ, ముత్యాల తలంబ్రాలు తదితర ఘట్టాలను అత్యంత వైభవోపేతంగా కనుల పండవగా నిర్వహించారు. అనంతరం భక్తులకు వడపప్పు, బెల్లం పానకం, పులిహోర, సిరా ప్రసాదాలను పంపిణీ చేశారు. కల్యాణ వేడుకల అనంతరం ఆలయాల్లో మహిళలతో కుంకుమ పూజలు నిర్వహించారు. బెల్లంపల్లి రామాలయం ఏరియా కోదండ రామాలయంలో జరిగిన సీతారాముల కల్యాణ వేడుకలకు బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్-రమ దంపతులు ముఖ్య అతిథులుగా హాజరై, సీతారాముల పెళ్లికి పట్టువస్త్రాలు సమర్పించారు. రాష్ట్ర మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య తలంబ్రాలు తెచ్చారు. శ్రీరాంపూర్ నస్పూర్ ఏరియాలో సింగరేణి తరుపున జీఎం సంజీవరెడ్డి దంపతులు పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించి పూజల్లో పాల్గొన్నారు. మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు, పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాసిపేట మండలం ధర్మరావుపేటలో మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వేడుకలకు హాజరై మొక్కులు తీర్చుకున్నారు. జైపూర్, రామకృష్ణాపూర్, చెన్నూర్ మండలం సుద్దాల, ఆస్నాద గ్రామాల్లో నిర్వహించిన కల్యాణ వేడుకల్లో చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామి దంపతులు పాల్గొన్నారు. పవర్ ప్లాంటులో డైరెక్టర్ సత్యనారాయణరావు, సీటీసీ బసివిరెడ్డి దంపతులు కల్యాణ వేడుకల్లో పాల్గొన్నారు. రామకృష్ణాపూర్‌లో ఏరియా జీఎం మనోహర్ దంపతులతో పాటు మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పాల్గొన్నారు. జన్నారం మండలం శ్రీ సీతారామ చంద్రలాయంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, తిమ్మాపూర్ రామాలయంలో బీఆర్‌ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భుక్య జాన్సన్‌నాయక్ వేడుకల్లో పాల్గొన్నారు.



వేంపల్లిలో సీతారాముల కల్యాణం



వేమనపల్లి: నీల్వాయిలో కల్యాణం



కోటపల్లి: కల్యాణంలో పాల్గొన్న భక్తులు



జైపూర్: పవర్ ప్లాంటులో కల్యాణ మహోత్సవంలో డైరెక్టర్ సత్యనారాయణరావు, సీటీసీ బసివిరెడ్డి దంపతులు



భీమారంలోని కోదండరామాలయంలో...



జన్నారం: పూజలు చేస్తున్న జాన్సన్‌నాయక్



మంచిర్యాలరూరల్: అన్నదానంలో భక్తులు



సుద్దాలలో కల్యాణం జరిపిస్తున్న పండితులు



నెన్నెలలో కల్యాణ వేడుకలు జరిపిస్తున్న అర్చకులు



దండేపల్లిలో కల్యాణం జరిపిస్తున్న పండితుడు



జన్నాపూర్‌లో కల్యాణం జరిపిస్తున్న పండితులు



మాదారం కోదండ రామాలయంలో...



శ్రీరాంపూర్: నస్పూర్ కాలనీలో కల్యాణం తిలకిస్తున్న భక్తులు



లక్సెట్టిపేట: హనుమాన్ ఆలయంలో కల్యాణానికి హాజరైన భక్తులు



రామకృష్ణాపూర్: హాజరైన భక్తులు

సమస్యలతో సహవాసం..!

- గెర్రెకాలనీలో రోడ్లు, మురుగు కాలువలు కరువు
- తాగునీరు అంతంతమాత్రమే..
- పన్నుల కడుతున్నా.. పట్టించుకోని అధికారులు
- ఇప్పటికైనా పరిష్కరించాలని ప్రజల వేడుకోలు

చెన్నూర్: ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యం గెర్రె కాలనీ వాసులకు శాపంగా మారింది. కాలనీలో కనీస సౌకర్యాలు లేక ప్రజలు సమస్యలతో సహవాసం చేస్తున్నారు. చెన్నూర్ మున్సిపాలిటీలోని 6 వార్డు పరిధిలో గల గెర్రెకాలనీలో కనీసం రోడ్లు, డ్రెయినేజీలు లేక మట్టి రోడ్లతోనే కాలం వెళ్లదీయాల్సిన దుస్థితి నెలకొంది. కాలనీలో 150కుటుంబాలు 500 మంది జీవిస్తున్నారు. మిషన్ భగీరథ నీరు సక్రమంగా రాకపోవడంతో, బోరు నీరే శుద్ధజలంగా మారింది. విద్యుత్ స్తంభాలు 200 మీటర్ల దూరంలో ఉండడంతో విద్యుత్ కనెక్షన్ తీసుకోవాలంటే రెండు బండిళ్ల వైరు పడుతుందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో పిచ్చి మొక్కలు పెరిగి మున్సిపాలిటీ పరిధిలో ఉన్నామా, అడవి ప్రాంతంలో ఉంటున్నామా అనే అనుమానం కలుగుతోందని కాలనీవాసులు పేర్కొంటున్నారు. వర్షం పడిదంటే కాలనీలో అడుగు వేసి అడుగు తీసే పరిస్థితి లేదు. డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో కాలనీలోని మురుగు నీరంతా రోడ్లపై పారుతుండడంతో మట్టి రోడ్లన్నీ బురదమయంగా మారాయి. రోడ్లపై మురుగు నీరు చేరడంతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. దోమలతో రోగాల బారిన పడుతున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.



గెర్రె కాలనీలో సీసీ రోడ్డు లేని దృశ్యం

పన్నులు వసూళ్లు..

సమస్యలు పరిష్కరించడంలో ముఖం చాటేసిన అధికారులు పన్నుల వసూళ్లలో ముందున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇంటి, నల్లా పన్నులు వసూలు చేస్తున్నారు కానీ, రోడ్లు, డ్రెయినేజీలు, తాగునీటి సమస్యలు పరిష్కరించాలని కార్యాలయాల చుట్టూ ప్రదిక్షిణలు చేసినా అధికారులు కనికరం చూపడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నికలప్పుడే..

ఎన్నికలప్పుడే వివిధ పార్టీల నాయకులు కాలనీలో పర్యటించి ఓట్లు దండుకుంటున్నారు. ఎన్నికల తర్వాత సమస్యలన్నీ పరిష్కరిస్తామని చెప్పి ఎన్నికలు అయిన తర్వాత హామీలు పట్టించుకున్న నాథుడే కరువయ్యారని ఆరోపిస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు కాలనీని సందర్శించి సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

కంపుకొడుతోంది..



డ్రెయినేజీలు లేకపోవడంతో మురుగు నీరు రోడ్లపై చేరి కంపుకొడుతోంది. దోమలు విపరీతంగా పెరుగుతున్నాయి. వర్షాకాలం వచ్చిందంటే ఇళ్ల నుంచి బయటికి వచ్చే పరిస్థితి లేదు. పలుమార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు.

– టప్ప సునీత, గెర్రె కాలనీ

ఒక్కటే బోరు..



వాడలో ఒక్కటే బోరు ఉంది. నీళ్ల కోసం పొద్దంతా పడిగాపులు కాయాల్సి వస్తంది. భగీరథ నీరు ఇత్తం అనడమే తప్పా.. నీరు వచ్చింది లేదు. చానా తిప్పలు పడుతున్నాం.

– మూగ సరిత, గెర్రె కాలనీ

ఘనంగా పల్లకి సేవ

దండేపల్లి: సీతారాముల కల్యాణ వేడుకల్లో భాగంగా దండేపల్లి మండల కేంద్రంలో బుధవారం రాత్రి పల్లకి సేవ ఘనంగా నిర్వహించారు. సీతారాముల ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఊరేగించారు. గ్రామంలోని అన్ని వీధుల గుండా పల్లకి సేవ సాగింది. పల్లకి సేవకు మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికి, పూజలు చేశారు. పల్లకి సేవలో హనుమాన్ దీక్షా స్వాములు పాల్గొని, రామనామ సంకీర్తనలు ఆలపించారు.



పల్లకి సేవలో హనుమాన్ దీక్షాపరులు

మజ్జిగ పంపిణీ

పాతమంచిర్యాల: శ్రీరామ నవమి సందర్భంగా జిల్లా కేంద్రంలోని ప్రధాన ఆసుపత్రి వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ స్టేట్ ప్రోటాన్ సభ్యులు మధుసూధన్ రెడ్డి ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు చల్లని మజ్జిగ, బట్టర్ మిల్క్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఎండల నుంచి ప్రజలకు ఉపశమనం కోసం బాటసారులు, ఆస్పత్రికి వచ్చే రోగులు, రోగుల సహాయకులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ భాస్కర్‌రెడ్డి, సెక్రెటరీ చందూరి మహేందర్, కోశాధికారి సత్యపాల్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్, శంకర్‌వర్మ, సత్యనారాయణ రెడ్డి, రక్తనిధి కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.



పంపిణీ చేస్తున్న ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు

సన్మానం

లక్సెట్టిపేట: గోదావరి రోడ్‌కు చెందిన రిటైర్డ్ ఉద్యోగి రాపల్లి భగవాన్‌ధాస్ జాతీయ స్థాయి యోగా పోటీల్లో బంగారు పతకం సాధించాడు. కాగా మండలంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఆయనను ఘనంగా సన్మానించారు.